ప్రజాశక్తి
శుక్రవారం 9 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి -హుకుంపేట:అనారోగ్యంతో బిఎస్సి నర్సింగ్ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని జర్ర కొండ పంచాయతీలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జర్ర కొండ పంచాయతీ గ్రామానికి చెందిన లిబిటి. వెంకటలక్ష్మి (19) బిఎస్సి నర్సింగ్ ఫస్ట్ ఇయర్ విశాఖపట్నంలోని చైతన్య కాలేజీలో చదువుతోంది. సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉన్న ఆమె వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. బుధవారం ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కి ఫోన్ చేశారు.రోడ్డు సౌకర్యం లేక వాహనాలు రాలేదు. తప్పని పరిస్థితులలో ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా గురువారం ఉదయం మృతి చెందినట్లు తండ్రి భీమన్న పాత్రుడు తెలిపారు.

వెంకటలక్ష్మి (ఫైల్ ఫోటో)

అరకులోయలో ఘనంగా..

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభం

- రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు
- ఆదివాసీల హక్కులు, చట్టాలపై దాడి చేస్తే ఊరుకోం : నేతల హెచ్చరిక

మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి-అరకులోయ/అరకు రూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభ గురువారం ఘనంగా ప్రారంభమైంది.మహా సభ ప్రారంభానికి ముందు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గిరిజన సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య నగర్ వేదిక వద్ద మాజీ ఎమ్మెల్యే, గిరిజన సంఘ మాజీ అధ్యక్షులు సున్నం రాజయ్య, గిరిజన సంఘం వ్యవస్థాపకుడు మాజీ ఎమ్మెల్యే కుంజ బొజ్జి, గిరిజన రైతు ఉద్యమ నేత కామ్రేడ్ శ్రీరామ్మూర్తి చిత్రపటానికి ఆదివాసీ అధికార రాష్ట్రీయ అఖిలభారత చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ రాష్ట్ర మహాసభకు ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు అధ్యక్షత వహించారు. అనంతరం ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ అఖిలభారత చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. భాషా వాలంటీర్ల నియామకాలు జరగలేదన్నారు. రాష్ట్రంలో భాషా వాలంటీర్లు 1200 మంది అవసరం ఉండగా, 400 మందిని నియమించారని ఆయన అన్నారు. ఒకే భాష ఒకే మతం ఉండాలన్నది బిజెపి లక్ష్యం అన్నారు. గిరిజన భాషల్లో విద్యా బోధన చేయడంతో డ్రాప్ అవుట్స్ నివారణ సాధ్య మవుతుందన్నారు. ఆదివాసీలు ప్రాచీన సంస్కృతికి వారసులని, వారిని చెదరగొట్టకూడదని ఆయన అన్నారు. గిరిజన భాషా సంస్కృతిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సంబంధించిన విలువైన చట్టాలను బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్లుగా మార్చి పనికిరానివిగా చేసిందని విమర్శించారు.1 /70 చట్టం, పిసా వంటి చట్టాలను పటిష్ట పరచకుండా తీసివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే 2014లో ప్రజాభిక సంప్రదం రద్దు చేసిందన్నారు.జీవో 3 రద్దు చేయడంతో గిరిజనులు పూర్తిగా ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని, ఇందుకు తెలంగాణ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసినప్పటికీ ఏపీ ప్రభుత్వం ఆ ఊసే లేదని ఆయన అన్నారు.వీటన్నిటిని సాధించుకోవడానికి ఐక్య పోరాటం విస్తృతంగా చేయవలసిన అవసరం ఉందన్నారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సంస్కృతిక సంబరాలు గిరిజన గిరిజనుల ఐక్యతను చాటిచెబుతుందని ఆయన అన్నారు.

గిరిజనుల ఉనికిపై దాడి
మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ఏజెన్సీ ప్రాంతంలోని వనరులను స్వాధీనం చేసుకోవడానికి గిరిజనుల ఉనికిపై దాడి ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ తెలిపారు. రాష్ట్ర మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, చీమలపై మందు వేసి చెదరగొట్టినట్లు గిరిజన ప్రాంతంలో గిరిజనం మధ్య చిచ్చుపెట్టి ఇక్కడున్న ఖనిజ సంపదలను దోచుకోవడానికి కార్పొరేట్ శక్తులు ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అప్పట్లో గిరిజనులందరూ ఒక తాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాటం చేయడంతో బాక్సైట్ తవ్వకాలకు ప్రభుత్వం వెనక్కు తగ్గిందని ఆయన అన్నారు.ఇప్పుడు గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి చల్లచెదురుచేసి ఉన్న ఖనిజ సంపదను దోచుకోవాలని చూస్తుందన్నారు.జీవో -3 ని రద్దు చేయడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని, 1/ 70 చట్టంపై కూడా దాడి ప్రారంభమైందని ఆయన అన్నారు. ఇప్పుడు ఆదాని వంటి వారి కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు.2014లో వచ్చిన మోడీ, అమిత్ షా బ్యాచిలను తీసుకుని వచ్చి గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి చర్చిలకు వెళ్లే గిరిజనులు శత్రువులుగా చూపిస్తుందన్నారు. ఇప్పుడున్నవి భద్రత లేని ఉద్యోగాలని, అప్పట్లోప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేవని ఆయన అన్నారు. స్టీల్ ప్లాంట్ లో 14,000 మందిలో 1000 మంది గిరిజనులు ఉన్నారని ఆయన అన్నారు. రైల్వే శాఖలో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని నింపే పరిస్థితి లేదన్నారు. ఈ ఉద్యోగాలు భర్తీ చేస్తే అందులో 25 వేల మంది గిరిజనులకు ఉద్యోగాలు వస్తాయని, అదే ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఒక ఉద్యోగం కూడా వచ్చే పరిస్థితి ఉండదన్నారు.అరకు లోయలో ఉన్న 140 లాడ్జిల్లో కూడా గిరిజనేతరులు బినామీ పేర్లతో నిర్మించుకుని ఉన్నారని, వాటిలో గిరిజనులు కూలీలుగా పని చేస్తున్నారని ఆయన తెలిపారు.ఏజెన్సీ 11 మండలాల్లో 9 మండలాల్లో కాఫీ ఉందని, దాని ధర నిర్ణయించే పరిస్థితి రైతులకు లేకపోవడం అన్యాయమన్నారు. అనంతగిరి ఆర్గానిక్ కాఫీకి డిమాండ్ ఉన్నా..కాఫీ రైతులకు మాత్రం ఫలితం దక్కడ లేదన్నారు. అల్లూరి, కొమరం భీమ్, గంటం దొరల పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజన ఉద్యమ నేతలకు నివాళి అర్పిస్తున్న బాబూరావు, తదితరులు

బలమైన ఉద్యమానికి రూపకల్పన : సురేంద్ర

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు బలమైన ఉద్యమం చేయడానికి రూపకల్పన చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. అరకులోయలో జరుగుతున్న గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో 1 లక్ష 50 వేల కుటుంబాలు కాఫీపై ఆధారపడి జీవిస్తున్నాయని, వీరికి అండగా నిలబడాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా నిలబడాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టును ఆదానికి ఇస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి బలమైన పోరాట నిర్మాణం అవసరం అన్నారు.గిరిజన ఉద్యమం బలపడడానికి ఆట, పాట మాట వంటి సంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడుతుందని, భవిష్యత్తులో వీటిని మరింతగా నిర్వహించాలని ఆయన అన్నారు.గిరిజన సంఘం చేసిన పోరాటాలపై కార్యకలాపాల నివేదికను మహాసభలో సురేంద్ర నివేదించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు అధ్యక్షత వహించిన ఈ మహాసభలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు, పి.అప్పలనరస, మంతెన సీతారాం, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, అధ్యక్షులు ధర్మన్న పడాల్, రాష్ట్ర అధ్యక్ష వర్గం నుంచి తెల్లం రామకృష్ణ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

హాజరైన ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు

ప్రతి నిర్వాసితునికి న్యాయం చేయాలి

- సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ వల్ల నిర్వాసితులవుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముల్లూరు గ్రామంలో వెంకమ్మ అధ్యక్షతన బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు ముందుగా పునరావాసం కల్పించకుండా, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా కాపర్ డ్యామ్ నిర్మించటం వల్ల ప్రతి ఏటా వరదలు వచ్చి గ్రామాలన్నీ ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిర్వాసితులందరికీ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ముంపునకు గురవుతున్న అన్ని గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామం నుండి ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 20 నుండి జులై 9 వరకు నెల్లిపాక నుండి విజయవాడ వరకు 18 రోజులు 400 కిలోమీటర్లు, 1000 మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముంపు గ్రామాలను కలుపుతూ సాగే ఈ పాదయాత్రకు నిర్వాసితులు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, నాయకులు పైదా భద్రయ్య, కట్టాం ప్రభాకర్, పొద్దేటి అశోక్, ఎస్.ప్రసాద్, సిహెచ్.రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ముంపు ప్రాంత ప్రజల బాధలు పట్టని ప్రభుత్వం

టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట, బురకా

ప్రజాశక్తి-విఆర్.పురం

ముంపు ప్రాంత ప్రజల సమస్యలు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి పట్టడం లేదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు ఆచంట శ్రీనివాసరావు, బురకా కన్నారావు ఆరోపించారు. గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతేడాది జులైలో వచ్చిన వరదల సమయంలో ప్రజలు నానా అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. విద్యుత్ లేక, తాగేందుకు నీరులేక, ఉండటానికి వసతులు లేక తీవ్రమైన ఇబ్బందులు పడ్డామని, అయినా నాడు వారిని పట్టించుకునే నాధుడే లేదని పేర్కొన్నారు. వైసిపికి అధికారంపై వ్యామోహం తప్ప ముంపు ప్రాంత ప్రజల బాధలు పట్టడం లేదని విమర్శించారు. ఈ నాటికి కూడా ముంపు బాధితులకు సరైన న్యాయం జరగలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు నేటికీ పునరావాసం కల్పించి ఒక్క ఇల్లు కూడా కట్టలేని ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని, విలీన మండలాల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు బురకా కన్నారావు, వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి, కారం సురేష్ బాబు, బీరక సూర్య ప్రకాష్ రావు, పెందుర్తి సుదర్శన్ రావు, ఆకోజి భాగ్యలక్ష్మి, చవలం రాజేంద్రప్రసాద్, ముత్యాల చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జాడ కనిపెట్టే జాగిలాలు

- పోలీసుల తాజా వ్యూహం

ప్రజాశక్తి-పాడేరు

మన్యంలో గంజాయి రవాణా నియంత్రణపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీస్ అధికారులు నిరంతరం ప్రత్యేక నిఘా చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ పోలీసుల కళ్ళు కప్పి మన్యం నుంచి అనేక ప్రాంతాలకు యదేచ్ఛగా గంజాయి రవాణా కొనసాగుతూనే ఉంది. తరచూ పలు ప్రాంతాలలో అనేకసార్లు గంజాయి పట్టుపడు తుండడమే ఇందుకు నిదర్శనం. పోలీసుల గస్తీ లేనప్పుడు స్మగ్లర్లు కనిపెట్టి రాత్రి సమయాల్లో ప్రత్యేక వాహనాల్లో మన్యం నుంచి గంజాయిని తరలిస్తుంటారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల సరికొత్త వ్యూహాలను అనుసరిస్తున్నారు. ఇటీవల అల్లూరి జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హా గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి జాడ కనిపెట్టేందుకు పాడేరు ఏజెన్సీలో ఏఎస్‌పి ధీరజ్ నిఘా చర్యలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా గంజాయిని పసిగట్టే శిక్షణ పొందిన జాగిలాలను రంగంలోకి దించారు. జాగిలాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. పాడేరు సీఐ సుధాకర్ సారథ్యం లో జాగిలాలను విరివిగా వాడుతూ వాహనాలను, అనుమానిత ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్నారు.



జాగిలాలతో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న పిఒ

రాష్ట్రపతి భవన్‌కు120 మంది పివిటిజిలు

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పిలుపు మేరకు పాడేరు ఐటిడిఎ పరిధిలోని 120 పివిజిటిలను ఢిల్లీ రాష్ట్ర పతి భవన్‌కు ప్రయాణ మయ్యారని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. గురువారం ఐటిడిఎ కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి పిఒ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రయాణమైన ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతూ, దేశంలో 29 రాష్ట్రాలను 1500 ఆదివాసీలకు రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం వచ్చిందన్నారు. ఆదివాసీ సమస్యలను అడిగి తెలుసుకుని విటిజి గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఐటిడిఎ పరిధిలోని అనంతగిరి మండలం నుండి 15 మంది, అరకు వ్యాలీ 13, డుంబ్రిగుడ 15, ముంచంగిపుట్టు 11, హుకుంపేట 15, పాడేరు 15, జి.మాడుగుల 10, కొయ్యూరు 15, జికె వీధి మండలం నుండి 11 మందిని ఢిల్లీకి పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు వివిఎస్ ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత, సెంట్రల్ కాఫీ బోర్డు మెంబరు ఉమా మహేశ్వరరావు, ట్రైకార్ అసిస్టెంట్ ఎన్.సీతారామయ్య పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు పసుపు కొనుగోలు కేంద్రాలు

- మార్క్ ఫెడ్ డిఎం రమేష్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో పసుపు క్వింటాలుకు రూ. 6850లకు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ కె.రమేష్ స్పష్టం చేశారు. గురువారం చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విఎలు, విహెచ్ఒలకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో డిఎం మాట్లాడుతూ, జిల్లాలో చింతపల్లి, జికె వీది, జి.మాడుగుల మండలాలలో వెలుగు ద్వారా పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలలో ఉన్న పసుపును మాత్రమే కేంద్రాలలో కొనుగోలు చేస్తారని, రైతులు తప్పనిసరిగా తమ పంటను ఎటువంటి వ్యర్థపదార్థాలు లేకుండా శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని, దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. పసుపు అమ్మిన రైతులకు బ్యాంక్ ఖాతాలకు పది రోజులలో జమ చేయబడతాయని ఆయన స్పష్టం చేశారు. రైతుభరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరించారు. ఈ శిక్షణా శిబిరంలో మార్కెఫెడ్ స్పెషల్ ఆఫీసర్ ప్రొక్యూర్మెంట్ కె.అరుణ, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు కర్ణ, శోభ, మదు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎం రమేష్

వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలేవీ?

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల ప్రజల్లో మళ్లీ భయాందోళన ప్రారంభమైంది. గతేడాది వరదల వల్ల ఎంత నరకం చేశారో తెలుచుకుంటూ భయపడుతున్నారు. నాడు ప్రభుత్వం, అధికారులు ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టలేదు. దీంతో వరద ఒక్కసారిగా గ్రామాలను ముంచెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ఇక్కడి నుండి ప్రజలను తరలించకపోవడంతో ప్రతి ఏటా వచ్చే వరదల వల్ల ముంపునకు గురవుతున్నారు. పునరావాస కాలనీలను కూడా ఇంకా పూర్తి చేయలేదు. ఈ ఏడాది కూడా ఇక్కడ నుండి వెళ్లే అవకాశం లేదు. దీంతో మళ్లీ వరద బాధలు తప్పవా అంటూ నిర్వాసిత ప్రజలు మొత్తుకుంటున్నారు. ప్రజలను వరదల నుండి రక్షించడానికి ప్రభుత్వం, అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టాల్సి ఉంది. జులైలో వరదలు ప్రారంభం కానున్నాయి. కాని ప్రభుత్వం మాత్రమూ జూన్ నెల ప్రారంభమైనా ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష జరుపలేదు. వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రభుత్వం ముందు నుండే అప్రమత్తం చేయాలిగాని, గోదావరి ముంచే సమయంలో ఉరుకులు పరుగులు పెడితే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు గత వరదలు బీభత్సం చూసి జనం వణుకుతున్నారు. ఇప్పటికైనా రాబోయే వరదకు కోసం మండల అదికారులతో సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం ప్రజా ప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వరద నీటితో ముంపునకు గురి కావడంతో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి

పాడేరు ఐటిడిఏ సాయంతో ఏర్పాటు చేసిన హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌ను జిల్లా కలెక్టర్. సుమిత్ కుమార్, ఐటీడీఏ పిఒ, అరకు పార్లమెంట్ సభ్యురాలు గొట్టేటి. మాధవి, శాసన సభ్యులు శెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ సుభద్ర ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, వాహన వినియోగదారులతో మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. బంక్ అందుబాటులోకి రావడంతో ఇటు స్థానిక ప్రజలకు, పర్యాటకులకు సౌకర్యార్థంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి .నీలవేణి, స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్. మదీనా, తహశీసిల్దార్ .రాంభాయి, ఇన్ చార్జి ఎంపీడీవో ఏవివి .కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, పిఒలకు సిపిఎం వినతి

మండలంలోని నెలకొన్న పలు సమస్యలపై కలెక్టర్,. ఐటీడీఏ పిఒ, ఎమ్మెల్యే లకు లిఖిత పూర్వకంగా విన్నవించారు.స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు, సర్పంచ్ సోమ్మెల .రూతు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగ, చిన్నకోనెల గ్రామాలలో గిరిజన రైతుల సాగు భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు.తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. బీంపోలు పంచాయతీ పరిధి నందకోట రెవెన్యూ చిమ్మిడిపల్లి గ్రామంలో కూడా అదే పరిస్థితి ఉందన్నారు. గ్రామ కంఠ భూమితో పాటు రైతులు సాగులో ఉన్న భూమి కూడా భూస్వామి ఆధీనంలో ఉందన్నారు. గ్రామాన్ని ఖాళీ చేయాలని గిరిజనులను భూస్వామి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు గంగరాజు తెలిపరు.సర్పంచ్. రూతు మాట్లాడుతూ, అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం నుండి రాజుపాక గ్రామం వరకు, అనంతగిరి, పెద్దూరు నుండి పాతకోట, రేగం. లక్ష్మీపురం గ్రామాలకు చెక్ డ్యామ్‌లు మంజూరు చేయాలని కోరారు

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

9న వాహనాల వేలం

ప్రజాశక్తి-పాడేరు:సారా కేసుల్లో సీజ్ చేయబడిన వాహనములను ఈ నెల 9న పాడేరు (స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బోర్డు) ఎస్ఈబి స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఏ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 22 వాహనములను వేలం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఉదయం 10:30 గంటలకు స్టేషన్ వద్ద నిర్వహించే బహిరంగ వేలం కు ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని కోరారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డుతో పాటు బయానా సొమ్ము 5000 రూపాయలు (వాపసు చేయబడే) చెల్లించాలని సూచించారు.

కాపీరైట్ చట్టంపై జాతీయ వెబినార్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల, ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా 'ఏఐ జనరేటెడ్ వర్క్స్ ఆథర్‌షిప్ అండ్ ఓనర్‌షిప్ అండర్ ద కాపీరైట్ యాక్ట్, 1957' అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. డిపిఐఐటి-ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ సదస్సులో 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 862 మంది విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయవాదులు, ఐపి నిపుణులు పాల్గొన్నారన్నారు. కాపీరైట్ చట్టం, ఏఐ జనరేటెడ్ వర్క్స్ తదితర అంశాలు మానవ జీవితంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయనే అంశంపై ప్రసంగించారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా జ్ఞానాన్ని సృష్టించిన వారికి, ఆవిష్కరించిన వారికి కొన్ని ప్రత్యేకమైన హక్కులు ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మేధో హక్కుల పరిరక్షణలో కాపీరైట్ చట్టం ఆవశ్యకతలను వివరించారు. ముఖ్య అతిథి ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రచయితలు, కళాకారులు, డిజైనర్లు, కంపోజర్లు ఇతర సృజనాత్మక వ్యక్తుల కాలాన్ని, మేధస్సును పరిరక్షించే దిశగా ప్రత్యేక హక్కులు అవసరాన్ని తెలిపారు. ఎఐ, చాట్ జిపిటి, చాట్‌బోట్ వంటి నూతన సాంకేతికతల ఆవిర్భావంతో ఎదురయ్యే కాపీరైట్ చట్టాల అవసరం, నూతన సవాళ్లను వివరించారు. అనంతరం నిర్వహించిన సాంకేతిక ప్రసంగాలలో భారత ప్రభుత్వ రిజిస్ట్రార్స్ ఆఫ్ కాపీరైట్, పూర్వ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జిఆర్ రఘువేందర్ నూతనంగాఎఐ సాంకేతిక ఆవిర్భావంతో ఎదురయ్యే సవాళు ,, చట్టపరమైన అంశాలను విపులీకరించారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -గాజువాక : ఈ నెల 18న జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 11వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా కన్వీనర్లు కె. అచ్యుతరావు, వై.రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం పెద్దగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తానని నమ్మించి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసపుచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ పేరుతో వంచనకు గురిచేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఎఐవైఎఫ్ జిల్లా మహాసభల్లో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను శిక్షించాలి

ప్రజాశక్తి- గోపాలపట్నం : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని విశాఖపట్నం డివైఎఫ్ఐ నాయకుడు బలివాడ వెంకటరావు డిమాండ్ చేశారు గురువారం గోపాలపట్నం జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మహిళా క్రీడాకారులకు మద్దతుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షునిగా ఉన్న బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్ క్రీడాకారుల పట్ల అనుచిత వైఖరిపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నెలరోజులకు పైగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే బ్రిజ్‌భూషణ్‌ను ఆ పదవి నుంచి తొలగించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లింగ్ సమాఖ్య జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని రెజ్లర్లు శాంతియుత నిరసన ర్యాలీ చేస్తుంటే, వారితోపాటు వారికి మద్దతిచ్చిన క్రీడాకారులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యవాదులు ఈ చర్యను ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నితిన్ యాదవ్ రాజు, శ్రీనివాస్, పృథ్వీ, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు

జిపిఎస్ పేరుతో నయవంచన!

క్యాబినెట్ నిర్ణయంపై ఉద్యోగ, ఉపాధ్యాయుల పెదవి విరుపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సిపిఎస్) వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు అవుతుందని వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు భావించారు. 2004 తర్వాత నియమించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొత్త పింఛను విధానంలో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగులు వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన స్పందించి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించారు. నాడు సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారని ఉద్యోగులు, ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. సిపిఎస్ ఉద్యోగులను నమ్మించి మోసం చేశారని, ఏళ్లుగా పాత పింఛను విధానాన్ని అనుసరిస్తున్న రాష్ట్రాల్లో లేని ఇబ్బంది ఎపికి ఏమిటని, సిపిఎస్ పై జగన్ హామీ ఇచ్చిన తర్వాత ఆయా రాష్ట్రాల్లో పాత పింఛనును పునరుద్ధరించినప్పటికీ ఎపిలో మాత్రం సాధ్యం కాదని ఉద్యోగులను మోసం చేశారని ఆవేదన చెందుతున్నారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగులను మోసం చేయకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛను పథకం (ఒపిఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిపిఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఒపిఎస్ అమలు చేయాలి. తాను ఇచ్చిన హామీని మరచి, కొత్తగా జిపిఎస్‌ను తెరపైకి తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఒపిఎస్ అమలు చేస్తారని ఎంతో నమ్మకంతో ఎదురు చూసాం. సిఎం జగన్ మోసపూరిత హామీతో నష్టపోయాం. రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులను వైసిపి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది.

కె.నీలకంఠం, టిడబ్ల్యు టీచర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సిపిఎస్ ఉద్యోగులను మోసగించడమే..

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తే జిపిఎస్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం దారుణం. జిపిఎస్ అమలుకు క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దీనికంటే సిపిఎస్‌లోనే ఉద్యోగులకు ఆర్థిక వెసులుబాటు ఉంది. ఎంతోమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబీకులు ఈ విధానం రద్దు కోసం ఆశతో ఎదురు చూశారు. తాజాగా సిపిఎస్ పై ప్రభుత్వ నిర్ణయంతో సిపిఎస్ ఉద్యోగులందరూ చాలా ఆందోళనతో ఉన్నారు.

వి.మహేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మోసపూరిత హామీ..

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్న జగన్ నాలుగేళ్ల తర్వాత కొత్త పథకం ప్రతిపాదించడం జగన్ మోసపూరిత హామీలకు నిదర్శనం. తాజాగా మంత్రివర్గ సమావేశంలో జిపిఎస్ పై తీసుకున్న నిర్ణయం లక్షల మంది ఉద్యోగులను నిరాశకు గురి చేసింది. ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఏదీ లేదు. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

ముఖి శేషాద్రి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మాట నిలబెట్టుకుంటారనుకున్నాం..

సిపిఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తానని ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీ ఆలస్యమైన మాట నిలబెట్టుకుంటారనే భావించాం. నాలుగేళ్ల తర్వాత తాజాగా రాష్ట్ర కేబినెట్‌లో జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగులకు ఇచ్చిన మాటను తప్పడమే. ఇప్పటికైనా ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా సిపిఎస్ ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకుంటారని భావిస్తున్నాం.

ఆర్.జగన్ మోహన్ రావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎన్ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఆరిలోవ : నేషనల్ మెరిట్ మీన్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్ష సంచాలకుల వెబ్‌సైట్‌లో ఈ ఫలితాలను ఉంచినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన జాతీయస్థాయి ఉపకార వేతన పరీక్ష ఫలితాలకు సంబంధించి ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపించనున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్ అకౌంట్ తీసుకొని, తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ నెంబర్‌ను మాత్రమే అకౌంట్‌కు జతపరచాలన్నారు. సేవింగ్ అకౌంట్‌లు తప్ప మరే ఇతర అకౌంట్‌లు పనిచేయవన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో

భాగ్యేష్‌కు స్వర్ణ పతకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జాతీయస్థాయి మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలికి చెందిన కోలా భాగ్యేష్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 6,7,8 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగిన అండర్ -13 విభాగంలో ఎపి తరపున పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్వయంకృషి తనను ఈ స్థాయికి చేర్చాయని భాగ్యేష్ అంటున్నాడు. జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన భాగ్యేష్‌ను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఛైర్మన్ మామిడి రమణ, కార్యదర్శి సూర్యనారాయణ, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బి.బొడ్డపుట్టు పంచాయతీ ఎర్రగొప్పు, దబ్బబంద, ములకాయిపుట్టు, బొట్టు మామిడి తదితర గ్రామాలను గురువారం జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం సందర్శించారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని ఉన్నత అధికారులతో మాట్లాడడం జరిగిందని జెడ్పిటిసి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుతో రూ.15.00 లక్షలతో బి.బొడ్డపుట్టు పంచాయతీ నుంచి ఎర్రగొప్పు గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి గురువారం పరిశీలించడం జరిగిందిని తెలిపారు.

గ్రంథాలయంలో యోగాపై శిక్షణ

యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం చిన్నారులకు వ్యాయామం నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని సునీత మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిన్నారులకు ఉపయోగపడే విధంగా వ్యాయామం, యోగాతో పాటు కథల, క్విజ్, ఇతర ఆటల పోటీలను నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-పెదబయలురూరల్:మండలంలోని బొండాపల్లి గ్రామ పంచాయతీలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు సర్పంచ్ బి.మత్స్యరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ,సెల్ టవర్ అందుబాటులో లేక అనేక మంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చింత కొండలరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సమస్యల పరిష్కారానికి సహకరించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, గంగవరం పోర్టు కార్మికులు, కార్మిక సంఘాలు, పోర్టు యాజమాన్యంతో ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి, చర్చలు విజయవంతం అయ్యేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్మికులు, కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై పోర్టు యాజమాన్య ప్రతినిధుల నుంచి వివరణ తీసుకున్నారు. కార్మికుల సమస్యలపై యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన వివరణ ప్రకారం కార్మికులు అందరూ శాశ్వత ఉద్యోగులేనని, గంగవరం పోర్టు లిమిటెడ్, గంగవరం పోర్ట్ సర్వీసెస్ ఉద్యోగులను ఒకే విధంగా పరిగణిస్తామని తెలిపారు. కార్మికులకు అందిస్తున్న ప్రత్యేక అలవెన్స్‌ను రెట్టింపు చేయాలని, కార్మికుల విద్యార్హతలను పరిగణనలోనికి తీసుకొని సాంకేతిక విద్యార్హతలుగల కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించి వారికి అదనంగా రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని పోర్టు యాజమాన్యానికి కలెక్టర్ తెలిపారు. తొలగించిన కార్మికులను వారి నుంచి వివరణ తీసుకొని తిరిగి నియామకం చేయాలన్నారు. బేసిక్ పే పెంపు అంశం ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని, ఈ విషయమై ప్రభుత్వానికి లేఖ రాస్తానని తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు ఇఎస్ఐ ఆసుపత్రుల్లోనే కాకుండా, ఇతర ఆసుపత్రుల్లో కూడా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా పోర్టు యాజమాన్యానికి సూచించారు. పోర్టు యాజమాన్యం సామాజిక బాధ్యతగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ అనంతరం వచ్చే గ్రాట్యూటీని వీలైనంత ఎక్కువ అందించేందుకుగల అవకాశాలను పరిశీలించాలన్నారు. కార్మిక సంఘం భవనాన్ని పోర్టు ఆవరణ బయట నిర్మించుకునేందుకు నిధులు అందజేస్తామన్నారు. కార్మికులకు రుణాల మంజూరు విషయమై బ్యాంకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పోర్టు యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలపై తీసుకున్న చర్యలను వారం రోజుల్లో నివేదిక సమర్పించాలన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, నొల్లి తాతారావు, మాత అప్పారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జిజె.రావు, సీనియర్ అడ్వైజర్ సాంబశివరావు, సిఇఒ బిజి.గాంధీ, మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, జనరల్ మేనేజర్ డిఐసి సిహెచ్.గణపతి, లేబర్ డిప్యూటీ కమిషనర్ సునీత, డిసిపి ఆనంద్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తూర్పు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె తూర్పు నియోజకవర్గం 15వ వార్డు పరిధిలోని వెంకోజీపాలెం, శెట్టిబలిజ కాలనీ, దుర్గానగర్ ప్రాంతాలలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు రూ.87.70 లక్షల వ్యయంతో వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ అప్పారి శ్రీ విద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మౌలికవసతుల కల్పనకు జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రానున్న రోజుల్లో జగనన్న ప్రభుత్వాన్ని అందరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వహణ ఇంజినీర్ శ్రీనివాసరావు, వార్డు ఇన్‌ఛార్జి అప్పారి గిరిబాబు, సచివాలయ సెక్రటరీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌లా మజాకా !

బదిలీ ఆర్డర్లపై పలువురు కోర్టుకు..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలంటేనే ప్రభుత్వ గల్లా పెట్టి నింపే సంస్థలన్నది తెలిసిందే. ఆహార సరుకుల గొడౌన్‌కు ఫ్రంట్ డోర్‌లు గట్టిగా ఉన్నా బ్యాక్ డోర్ నుంచి పందికొక్కులు జొరబడి సరుకులను ఖాళీ చేయడం ఎంతటి నిజమో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చర్యల విషయంలో కొద్ది మంది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులూ అంతే అన్న విషయమూ విదితమే. పెక్కు మంది 'దొడ్డిదారుల్లో' దిగమింగేందుకు తిష్టవేస్తారన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)కి పట్టుబడిన కొంతమంది బదిలీల్లో వేరే చోటుకు వెళ్లిపోయి కూడా రాజకీయ పలుకుబడితో మళ్లీ ఆ సీట్లలోకి వచ్చి కూర్చొనడం తాజాగా జరిగిన సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నగర శివారు మండలానికి చెందిన ఓ సబ్ రిజిస్ట్రార్ తన బదిలీని సవాల్ చేస్తూ కోర్టునాశ్రయించడానికి తాజాగా సిద్ధమవుతున్నారు. ఇంకొంతమంది అధికారులు సైతం కోర్టుకెళ్లి తమ బదిలీలను నిలుపుదల చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

విశాఖ నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఆర్డర్ల నిలిపివేతకు తీవ్రయత్నాలు

విశాఖపట్నం రీజియన్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో బదిలీలను ఒకసారి చూస్తే ఏ కార్యాలయం నుంచి ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లారో అదే కార్యాలయానికి మరలా సదరు అధికారులొచ్చి కూర్చొనడం విశేషం. దీంతో ఉత్తర్వులేమిటి ? ఇలా మారిపోయాయంటూ విస్తుపోవడం సిబ్బంది వంతైంది. నగరంలోని జగదాంబ ప్రాంతంలోని సూపర్‌బజార్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టేదన్నది తెలిసిందే. 2021 మార్చిలో రూ.132 కోట్లు, 2022 మార్చికి రూ.203 కోట్లు, 2023 మార్చికి రూ.199.52 కోట్ల ఆదాయంతో ఈ కార్యాలయం అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను ఉన్నతాధికారులు మారుస్తూ కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ రిజిస్ట్రార్ 2గా శ్రీనివాసులు, జాయింట్ రిజిస్ట్రార్-1గా మరొకరిని ఇక్కడ నియమించారు. దీంట్లో ఒక అధికారి ఫోన్‌కు బయట వ్యక్తులు 'ఫోన్ పే'లో డబ్బులు గుమ్మరించడం అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు. తనిఖీల అనంతరం నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. దీంతో వీరిని ఇక్కడ నుంచి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. రాజాం, పొందూరులో పనిచేస్తున్న ఇద్దరిని ఇక్కడ నియమించారు. తాజాగా ప్రభుత్వం చేసిన బదిలీల్లో మరలా వీరిద్దరూ వచ్చి నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధుల్లో చేరడంతో అంతా అవాక్కయ్యారు. పొందూరు నుంచి ఇలా సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శ్రీనివాసులు విచ్చేశారు. ఆయనొక్కడికే ఇలా పెద్దపీట వేయడం వెనుక శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ అధికార పార్టీ నేత హస్తం ఉందన్న చర్చ విశాఖ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతోంది.

వినియోగదారులకు సహాయకారిగా 'మీ షో'

ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఈ - కామర్స్ మార్కెట్ దిగ్గజం మీ షో నూతన బ్రాండ్‌ను ఆవిష్కరించినట్టు సంస్థ వ్యవస్థాపకులు విదిత్ ఆత్రేయ్ వెల్లడించారు. గురువారం నగరంలో జరిగిన విక్రేతల సమావేశంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రతి భారత పౌరుడు తమ మొదటి కొనుగోలులో పరిపూర్ణమైన ఆనందానుభూతిని పొందేందుకు మీ షో సహకరిస్తుందన్నారు.

సీనియర్ జర్నలిస్టు కొండలరావుకు సతీవియోగం

ప్రజాశక్తి - సీతమ్మధార : సీనియర్ జర్నలిస్ట్, ప్రజాశక్తి విశాఖ కలెక్టరేట్ విలేకరి ఆడారి కొండలరావు సతీమణి గిరిబాల బుధవారం రాత్రి కన్నుమూశారు. కొద్ది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందారు. ఆబిద్ నగర్ పార్కు సమీపాన వారు నివసిస్తున్న అపార్టుమెంట్ వద్ద గిరిబాల పార్థివ దేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు సుబ్బారావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, గ్రేటర్ విశాఖ బ్యూరో మధు, ఎడివిటి ఇన్‌ఛార్జి రాజేష్ రెడ్డి, సిబ్బంది హరిబాబు, రాజేష్, శ్రీను, భాగ్యరాజ్, రాజ్ కుమార్, జర్నలిస్టుల సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు, పలువురు పాత్రికేయ సిబ్బంది సందర్శించి నివాళ్లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు, విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ ఎస్.సుధాకర్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

గిరిబాల పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, కుమార్ తదితరులు

అధికారులతో మాట్లాడుతున్న అంగముత్తు

ఐఎంయు, సిఇఎంఎస్‌లను సందర్శించిన అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సబ్బవరంలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయు) క్యాంపస్‌తో పాటు విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్)ను విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు గురువారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో సమావేశమయ్యారు. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సంస్థలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఐఎంయు, సెమ్స్ సిలబస్‌ను అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలార్ పవర్‌లో ఎంఒయులు కుదుర్చుకోవాలని, పోర్టు మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పోర్టు, డిసిఐలో ఉన్న ఇంటర్న్‌షిప్ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఎంయులో విద్యార్థులు ఉండేందుకు హాస్టల్ సౌకర్యాలను మెరుగుపరచాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అవసరమైన బుక్స్, జర్నల్స్‌తో కూడిన లైబ్రరీ ఏర్పాటుకు విపిఎ సహకరిస్తుందని, డిజిటల్ సౌకర్యాన్ని కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్‌లోని ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగా బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా రైళ్ల నియంత్రణ కొనసాగుతున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 8 గురువారం బయలుదేరాల్సిన 22603 ఖరగ్‌పూర్-విల్లుపురం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22851 సంత్రాగచ్చి-మంగుళూరు వివేక్ ఎక్స్‌ప్రెస్, 22874 విశాఖపట్నం-దిఘా వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 12842 ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్, 22888 ఎస్ఎంవిటి బెంగళూరు - హౌరా హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను రద్దు చేశారు. జూన్ 9 శుక్రవారం 22873 దిఘ-విశాఖపట్నం వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22817 హౌరా-మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22807 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 22605 పురూలియా - విల్లుపురం బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జూన్ 11 ఆదివారం 22818 మైసూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రయాణికులు అధికారులకు సహకరించాలని కోరారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఒడిశాలోని బాలాసోర్ సమీపాన జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి మార్గదర్శకత్వంలో డివిజన్‌కు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వింగ్ సభ్యులు గురువారం సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డిఆర్ఎం కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అనుప్ సత్పతి మాట్లాడారు.

పారదర్శకంగా పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రానున్న సంవత్సరం సాధారణ ఎన్నికలతో పాటు మరిన్ని సవాళ్లతో కూడుకొని ఉండడంతో స్వయంగా నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మనే కానిస్టేబుళ్ల సర్వీస్, వయసు, వీలైనంత వరకూ వారు కోరుకున్న మొదటి ఐదు ప్రాధాన్యతలనూ పరిగణలోకి తీసుకొని వారికి స్థాన చలనం చేసినట్టు తెలుస్తోంది. నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ బదిలీలలో భాగంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేస్తుకున్న కానిస్టేబుళ్ల బదిలీలను గురువారం నిర్వహించారు